క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: మండలంలోని గిరవెల్లి గ్రామానికి చెందిన లాట్కరి పెంటయ్య, అల్లూరి శంకర్‌లు ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబస భ్యులను బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు ఉన్నారు.

సాంకేతికతతో నాణ్యమైన విద్యుత్ సరఫరా

ఆసిఫాబాద్‌అర్బన్: విద్యుత్ వినియోగదారులకు సాంకేతికతతో నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని ఆసిఫాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఆధునాతన సాంకేతిక పద్ధతులు అవలంభిస్తున్నామన్నారు. డిస్కమ్‌కు సంబంధించిన ప్రతీ సమాచారాన్ని చేసే డాష్ బోర్డు అప్లికేషన్‌ను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు.

ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ అన్ని విభాగాల అధికారులతో ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష నిర్వహించారు. ఏరియాలో కొత్తగా ప్రారంభం కానున్న గోలేటి ఓసీపీపై చర్చించారు. అన్ని రకాల అనుమతులు పొందేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వర్షాలను దృష్టిలో ఉంచుకుని వట్టివాగు వరదను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. గతేడాది ఆగస్టులో కేవలం పదిరోజులు మాత్రమే వర్షం పడగా.. ఈ ఏడాది ఆగస్టులో ఏకంగా 21 రోజులపాటు వర్షం కురిసి బొగ్గు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం ఏర్పడిందని తెలిపారు. గతేడాది ఆగస్టు వరకు ఏరియా వందశాతం ఉత్పత్తి సాధించగా.. ఈసారి వర్షాలతో 94 శాతం ఉత్పత్తి సాధించగలిగామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ప్రాజెక్టు అధికారులు నరేందర్, ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బారికెడ్లు ఏర్పాటు చేయాలి



కల్వర్టును పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో

కెరమెరి: కోతకు గురైన రోడ్ల వద్ద ప్రమాదసూచికలు, బారికెడ్లు ఏర్పాటు చేయాలని జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మి నారాయణ అన్నారు. బుధవారం మండలంలోని ఇంద్రానగర్ గ్రామ సమీపంలో ఇందాపూర్ గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు కోతకు గురి కావడంతో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదకరంగా ఉందని, వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. అనంతరం సాంగ్వి గ్రామసమీపంలోని కల్వర్టును పరిశీంచారు. ఆయన వెంట ఎంపీడీవో అంజద్‌పాషా, పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్ ఉన్నారు.

ఎస్సైలకు సన్మానం

కాగజ్‌నగర్ రూరల్: కాగజ్‌నగర్ పట్టణ నూతన ఎస్సైలుగా బాధ్యతలు స్వీకరించిన ధీకొండ రమేశ్, సుధాకర్‌లను బుధవారం విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి సన్మానించారు. సంఘం అధ్యక్షుడు జయదేవ అబ్రహం, కార్యదర్శి శివప్రసాద్, వై ఎస్‌ఆర్ మూర్తి, నర్సయ్య, షేక్ మహబూబ్, అన్వర్, అహ్మద్, నర్సయ్య, సుభాష్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

కాగజ్‌నగర్ రూరల్: ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బుధవారం పోలీసులు బాధితుడికిఅప్పగించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కృష్ణంరాజు గౌడ్ అనే వ్యక్తి కాగజ్‌నగర్ నుంచి ఈజ్‌గాంకు వస్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయగా, ట్రేస్ చేసి అప్పగించినట్లు ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు.

గుంతలు పూడ్చివేత

కౌటాల: కౌటాల, కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై ముత్తంపేట సమీపంలోని భారీ గుంతలను బుధవారం ఎంపీడీవో కోట ప్రసాద్ కంకరతో పూడ్చి వేయించారు. పార్డీ చౌరస్తాలో రోడ్డుపై భారీ గుంతలు ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కలెక్టర్ కౌటాల మండల పర్యటనలో భాగంగా గుంతలు పరిశీలించి స్థానిక కంకర క్రషర్ల యజమానులతో మాట్లాడి కంకరతో పూడ్చివేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో సిబ్బందితో గుంతలు పూడ్చి వేయించారు.

సబ్‌సెంటర్లు పూర్తయ్యేదెప్పుడో?

- అసలే సీజనల్ వ్యాధులు
- మండలంలో ఏడు సబ్‌సెంటర్లకు పక్కా భవనాలు మంజూరు
- ఒక్కో భవనానికి రూ. 20 లక్షలు
- పూర్తయింది గిరవెల్లి సబ్‌సెంటర్ ఒక్కటే



దహెగాంలో నిలిచిన సబ్‌సెంటర్ నిర్మాణ పనులు

దహెగాం: ప్రభుత్వాలు గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందాలనే ఉద్దేశ్యంతో సబ్‌సెంటర్ల పక్కా భవనాల కోసం నిధులు మంజూరు చేస్తున్నా.. కిందిస్థాయి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సకాలంలో పూర్తికావడం లేదు. దీంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడం లేదు. పక్కా భవనాలు లేక సిబ్బంది సైతం స్థానికంగా ఉండక పోవడంతో అత్యవసర సమయాల్లో ప్రజలు ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

ఏడు సబ్‌సెంటర్లు..

మండల కేంద్రంతో పాటు, హత్తిని, పంబాపూర్, బీబ్రా, ఇట్యాల, కుంచవెల్లి, గిరవెల్లిలో సబ్ సెంటర్లు ఉన్నాయి. వీటికి పక్కా భవనాలు లేక పోవడంతో నేషనల్ హెల్త్ మిషన్ కింద గత రెండు సంవత్సరాల క్రితం పక్కా భవనాలు నిర్మించడానికి ఒక్కో భవనానికి రూ. 20 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. గిరవెల్లిలో గత నాలుగు నెలల క్రితం పూర్తి కాగా దాన్ని ప్రారంభించారు. హత్తిని, పంబాపూర్ గ్రామాల్లో సబ్‌సెంటర్లు పనులు కొనసాగుతున్నాయి. బీబ్రా, ఇట్యాల, కుంచవెల్లిలో పూర్తి కాగా.. దహెగాంలో సబ్‌సెంటర్ పనులు నిలిచిపోయి సంవత్సరాలు గడుస్తున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

గ్రామాల్లో విషజ్వరాలు..

వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. జ్వరాల బారిన పడుతున్న పల్లెల్లో ప్రజలు సర్కారు వైద్యం అందక ప్రైవేట్ వైద్యుల వద్ద వైద్యం చేయించుకొని ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. సబ్‌సెంటర్‌లలో వైద్యులను నియమించినా.. పక్కా భవనాలు పూర్తికాక పోవడంతో స్థానికంగా ఉండకుండా దూర ప్రాంతాల నుంచి రాకపో కలు సాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సబ్‌సెంటర్ల భవనాలు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం

మండలంలో ఏడు సబ్ సెంటర్ల నిర్మాణాలకు ఎన్‌హెచ్‌ఎం కింద ఒక్కో భవనానికి రూ. 20 లక్షలు మంజూరు చేసింది. అన్ని చోట్ల పనులు ప్రారంభించాం. హత్తిని, పంబాపూర్‌లో పనులు కొనసాగుతున్నాయి. బీబ్రా, ఇట్యాల, కుంచవెల్లిలో పూర్తయ్యాయి. వాటిని వారం లోగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం. దహెగాంలో పనులు నిలిచి పోయినందున కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగిస్తాం.

– సందీప్, ఏఈ

దుండగుడిని కఠినంగా శిక్షించాలి



బాధిత మహిళను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవలక్ష్మి

కాగజ్‌నగర్ రూరల్/ఆసిఫాబాద్: జైనూర్ మండల కేంద్రంలో మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే హరీశ్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. అత్యాచారం, హత్యాయత్నానికి పాల్పడిన దుండగునికి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. అలాగే హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళను బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు.

నేడు బంద్

కెరమెరి/తిర్యాణి: జైనూర్ ఘటనలకు నిరసనగా గురువారం కెరమెరి, తిర్యాణి మండల కేంద్రంలో బంద్ నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించాలన్నారు.

కెరమెరి/లింగాపూర్/బెజ్జూర్: జైనూర్ మండం లోని ఓ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తిని ఉరితీయాలని బుధవారం కెరమెరి, లింగాపూర్, బెజ్జూర్ మండలాల్లో ఆదివాసీలు నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. లింగాపూర్ మండల కేంద్రంలో దుకాణాలను బీజేపీ నాయకులు బంద్ చేయించారు. అనంతరం రోడ్డుపై ధర్నా చేపట్టారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదని తెలిపారు. ప్రతినెలా వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను క్రమబద్ధీకరించి, బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, శ్రీనివాస్, నాయకులు శ్యామల, లచ్చక్క, సీతారాం, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకట్రావ్‌పేట్‌లో వైద్యశిబిరం



వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

సిర్పూర్(టి): మండలంలోని వెంకట్రావ్‌పేట్ గ్రామానికి చెందిన దంద్రె గంగోత్రి జ్వరంతో మృతి చెందగా బుధవారం వెంకట్రావ్‌పేట్ గ్రామంలో వైద్యాధికారులు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో తుకారాం, డీపీవో భిక్షపతి గౌడ్, జిల్లా పరీక్షల విభాగం అధికారి ఉదయ్‌బాబులు పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి గ్రామంలో ఉన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధ్యుల బారిన పడకుండా గ్రామస్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనారోగ్యం బారిన పడితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. వీరి వెంట ఎంపీడీవో సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కౌటాల: సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం అన్నారు. కౌటాల పీహెచ్‌సీని బుధవారం తనిఖీ చేశారు. గ్రామీణ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్‌ఈవో కోటేశ్వర్, స్టాఫ్‌నర్స్ వర్ష తదితరులు ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.2 గ్రామంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు బహుమతులు అందజేశారు. వినాయక స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్‌లో విన్నర్‌గా నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.12, రన్నర్‌గా విలేజ్ నెం.2 గ్రామ జట్లు గెలుపొందగా, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బికాస్ ఘరామి, మండల అధ్యక్షుడు రణ్‌వీర్ బిశ్వాస్, అమిత్ బిశ్వాస్, అశుతోష్, రాకేశ్ పాల్గొన్నారు.

మొబైల్ రీడింగ్ లైబ్రరీ



మొబైల్ రీడింగ్ లైబ్రరీ వద్ద విద్యార్థులు

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా రూం టూ రీడ్ ఆధ్వర్యంలో బుధవారం మొబైల్ రీడింగ్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. లైబ్రరీలో పుస్తకాలు, పోస్టర్లు, స్టోరీ కార్డ్స్, బిగ్ బుక్స్ పుస్తకాలతో పాటు అనేక రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. పాఠశాల విద్యార్థులతో పాటు స్థానికులు మొబైల్ రీడింగ్ లైబ్రరీ వద్ద పుస్తకాలు చదివారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

వాంకిడి: పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆరోగ్య విస్తరణ అధికారి పెందుర్ రవిదాస్ అన్నారు. బుధవారం మండలంలోని బెండార, ఖిరిడి గ్రామాల్లో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. కాన్పుకు వారం రోజుల ముందే ఆసుపత్రికి రావాలని అప్పుడే తల్లీ, బిడ్డ క్షేమంగా ఉంటారని సూచించారు. క్రమం తప్పకుండా హెల్త్ చెకప్ చేయించుకోవాలన్నారు. వర్షాకాలంలో తీసుకునే జాగ్రత్తలను వివరించారు. ఆహారంలో ఆకుకూరలు, గుడ్లు, పోషకాహారం ఉండేలా చేసుకోవాలన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది స్వప్న, మమత, కృష్ణ కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

ఎంఈవో సోమయ్యకు వీడ్కోలు



ఎంఈవో సోమయ్యను సన్మానిస్తున్న టీచర్లు

కౌటాల: మండల విద్యాధికారిగా 20 ఏళ్లపాటు విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన ఎంఈవో డి.సోమయ్యను కౌటాల, చింతలమానెపల్లి మండలాలకు చెందిన ఉపాధ్యాయులు బుధవారం రాత్రి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అనంతరం సోమయ్య మాట్లాడుతూ కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల్లో ప్రభుత్వ విద్య బలోపేతం కోసం కృషి చేశానని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తడి ఆరక..అరక సాగక



బారేమోడిలో పత్తి పంటలో నిలిచిన వర్షాపు నీరు

- ప్రతీరోజూ కురుస్తున్న వర్షం
- ముందుకు సాగని వ్యవసాయ పనులు
- ఆందోళనలో అన్నదాతలు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో గత కొన్ని రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలకు వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదు. తడి ఆరక పోవడంలో అరక సాగడం లేదు. శనివారం నుంచి నేటి ఎడతెరిపి లేని వర్షాల కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 31 గ్రామ పంచాయతీల్లో 8145 మంది రైతులు ఉండగా.. 29 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో 24 వేల ఎకరాల్లో కేవలం పత్తి పంటనే సాగు చేస్తున్నారు.

అరకలు సాగక..

వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి పంటలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో అటు అరక సాగడం లేదు. విత్తనం నాటిన నుంచి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో నేల తడి ఆరడం లేదు. గడ్డి భారీగా పెరిగి పొలాలు అడవులను తలపిస్తున్నాయి. తేమ శాతం అధికంగా ఉండడంవల్ల కొన్ని చోట్ల మొక్కలు రంగులు మారుతున్నాయి. కొందరు గడ్డి మందుతో పిచకారి చేస్తుండగా.. మరికొందరు కూలీలను పెట్టి తొలగిస్తున్నారు. ప్రస్తుతం పది మంది కూలీలు కలుపు తీయాల్సి ఉండగా.. అదే పనిని 30 మంది వరకు చేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. ప్రస్తుతం ఒక్కో ఎకరానికి పెరిగిన గడ్డిని చూసి కూలీలు ఎకరానికి రూ. 10 వేల నుంచి 15 వేల వరకు గుత్తగా అడుగుతున్నారు. దీంతో ఏం చేయాలో తోచక అన్నదాలు దిగాలు చెందుతున్నారు.

కలుపు తీతకు అధిక ఖర్చు



రోజూ కురుస్తున్న వానలతో పత్తి పంటలో గడ్డి అధికమైంది. దీంతో కూలీలు ఎక్కువ డబ్బులు అడుడుతున్నారు. రోజువారి కూలీగా రమ్మంటే రావడం లేదు. ఎకరానికి రూ.8 నుంచి రూ. 10 వేల వరకు గుత్తకు ఇవ్వాల్సి వస్తుంది.

– సిడాం మానిక్‌రావు, రైతు, శివగూడ

తగ్గిన పెన్‌గంగ వరద ఉధృతి



అంగన్‌వాడీ కేంద్రంలోకి చేరిన వరద

సిర్పూర్(టి): మండలంతో పాటు ఎగువ ప్రాంతమైన మహారాష్ట్రలో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పెన్‌గంగ ఉధృతంగా ప్రవహించింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అ యితే బుధవారం ఉదయం నుంచి పెన్‌గంగ నది వ రద ఉధృతి తగ్గడంతో మాకిడి, జక్కాపూర్, హుడ్కి లి, వెంకట్రావ్‌పేట్, టోంకిని, పారిగాం గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వెంకట్రావ్‌పేట్‌- పోడ్సా రహదారిలోని వంతెనపై పేరుకుపోయిన బురదను అధికారులు జేసీబీతో తొలగించారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి వరద

పెంచికల్‌పేట్: మండలంలోని కొత్తగూడ అంగన్‌వాడీ కేంద్రంలోకి వరద నీరు చేరింది. అంగన్‌వాడీ కేంద్రానికి సమీపంలో పెంచికల్‌పేట్ బీటీ రహదారి నిర్మాణ పనులు చేపట్టారు. పాత కల్వర్టు స్థానంలో కొత్త నిర్మాణం కోసం జేసీబీ సాయంలో పనులు చేస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రంలోకి వరదనీరు చేరింది. పంచాయితీ కార్యదర్శి చంద్రయ్య జేసీబీ సాయంతో వర్షపు నీరు వెళ్లేందుకు వీలుగా కాలువ తీయించారు.

ఆసిఫాబాద్‌రూరల్: భారీగా కురిసిన వర్షంకు బుధవారం మండలంలోని బూర్గుడలోని బీసీ కాలనీ లోని శ్రీనివాస్, పెంటయ్య మోతుగూడ గ్రామంలో ఇర్ధండి వినోద్, బోట్టుపల్లి మల్లయ్య, తులసిరాం, లక్ష్మణ్, తిరుపతి ఇంట్లోకి వరదనీరు చేరింది. ఇంట్లోని నిత్యావసర సరుకులు తడిసిపోయాయి.

వర్షం తగ్గినా.. తగ్గని వరద



దుర్గాపూర్‌కు ఆనుకుని నిలిచిన ఉన్న వర్షపునీరు

రెబ్బెన: మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాలతో ప్రజలు బంబేలెత్తిపోతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఇళ్లలోకి వరద నీరు చేరింది. నిత్యావసర వస్తువులతో పాటు ఇతర సామగ్రి తడిసింది. గోలేటిలోని మానెపెల్లి కుంటకు భారీగా వరదనీరు వచ్చి చేరడంతో అలుగు పారుతోంది. బుధవారం ఉదయం సైతం కురిసిన భారీ వర్షానికి వరద ప్రవాహం అధికమై దుర్గాపూర్ గ్రామానికి అనుకుని వరదనీరు పొటెత్తింది.

పొలాల్లోకి చేరిన వరద



గోయగాంలోని పత్తి పంటలో చేరిన వర్షపు నీరు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామంలో బు ధవారం భారీ వర్షం కురిసింది. దీంతో అనేక వ్యవసాయ పొలాల్లో వరదనీరు చేరింది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్య క్తం చేస్తున్నారు. అలాగే లక్మాపూర్, గోర్యాగూ డ, అనార్‌పల్లి వాగులు పొంగిపొర్లుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

బురద మిగిలింది..



బురదే మిగిలిందని వాపోతున్న రైతు జాడె ప్రభాకర్

కౌటాల: కోటి ఆశలతో పంటలు సాగు చేసిన రైతులు వర్షాల కారణంగా కష్టాలు తప్పలేదు. ప్రాణహిత, వార్ధా పరీవాహక ప్రాంత రైతులకు ఏటా కన్నీరే మిగులుతోంది. బుధవారం వరద తగ్గుముఖం పట్టగా.. కౌటాల మండలం వీర్దండి గ్రామ శివారులోని మిర్చి, పత్తి చేలు బురద, ఇసుక మేటలతో దర్శమిచ్చాయి. వందల ఎకరాల్లో మళ్లీ మిర్చి విత్తనాలు వేయాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్హులకు ప్రమోషన్లు కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన: ఈపీ ఆపరేటర్స్ ప్రమోషన్ పరీక్షలకు హాజరై అర్హత సాధించిన వారికి ప్రమోషన్లు కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజేష్, కైరిగూడ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైరిగూడ ఓసీపీలో బుధవారం మేనేజర్ శంకర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం ఇటీవల కల్పించిన ప్రమోషన్లలో చాలామంది ఈపీ ఆపరేటర్లు అర్హత ఉన్నా ప్రమోషన్లు పొందలేకపోయారని తెలిపారు. గ్రేడ్ పరీక్షలకు హాజరైన వారికి ఖాళీలతో సంబంధం లేకుండా ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు పుట్ట అంజయ్య, నరేష్, ఇక్బాల్ పాల్గొన్నారు.